సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



ఘనంగా సహస్ర తులసి పూజ
కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొన్నారు. 8లో



హృదయం.. పదిలమేనా?
జీవన శైలిలో మార్పులు, అధిక బరువు, రక్త పోటు, మధుమేహం తదితర సమస్యలతో గుండె లయ తప్పుతోంది. 8లో



ముల్లంగికి గిరాకీ
ముల్లంగి దుంపల వినియోగం పెరగడంతో మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. వారపు సంతల్లో విక్రయాలు జోరందుకున్నాయి. 9లో

న్యూస్‌రీల్

గంజాయితో నలుగురి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్కవరం జంక్షన్ వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. వేర్వేరు కేసుల్లో గంజాయి తరలిస్తూ నలుగురు పట్టుబడినట్టు ఆయన పేర్కొన్నారు. కరీంనగర్‌కు చెందిన ఇద్దరిని, మహారాష్ట్రకు చెందిన ఇద్దరిని అరెస్టు చేశామని ఆయన పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.50 వేలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టు హాజరుపరుస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వర్షం



అరకులో కురుస్తున్న వర్షం

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యటక కేంద్రమైన అరకులోయలో రెండు రోజులుగా భిన్నవాతావరణం నెలకొంటోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఆ తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురుస్తోంది. గురువారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన విద్యార్థి అప్పారావు

అరకులోయ రూరల్: మండలంలో కొత్తభల్లుగూడ పంచాయతీ గద్యగుడ గ్రామానికి చెందిన విద్యార్థి వంతల అప్పారావు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. లోతేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 8వతరగతి చదువుతున్న అప్పారావు గురువారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చాడు. ఆడుకునేందుకు సమీప రైల్వేలైన్ వద్దకు వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడి కిందకు పడిపోయాడు. వెంటనే అతనిని బంధువులు అరకులోయ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో వారి సిఫార్సు మేరకు కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు.

పిడుగుపాటుకు గిరిజనుడి మృతి



భీమరాజు మృతదేహం

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ గరిమండకు చెందిన కిలో భీమరాజు బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మరణించాడు. పని నిమిత్తం చల్దిగెడ్డకు వెళ్లిన అతను తిరిగి వస్తుండగా పిడుగుపడింది. దీంతో ఉన్నచోటనే మరణించాడు. మృతుడికి భార్య, ఆరుగురు పిల్లలున్నారు. భీమరాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబం పోషించే దిక్కును కోల్పోయింది. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అటవీ పర్యాటకం సరికొత్తగా..

జిల్లా ముఖద్వారమైన అనంతగిరి మండలం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనుంది. త్వరలోనే సరికొత్త ప్రాజెక్టులతో పర్యాటకులకు స్వాగతం పలకనుంది. ఒక పక్క అటవీ సంరక్షణ.. మరోపక్క పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం.. మరుపురాని అనుభూతి కలిగించే లక్ష్యంతో ఇవి రూపుదిద్దుకుంటున్నాయి.

- పర్యాటకులకు మరుపురాని అనుభూతి పొందేలా కొత్త ప్రాజెక్టులు
- గోస్తనీపై విహరించేలా జిప్‌లైన్
- అనంతగిరి ప్రాంతంలో సీతాకోక చిలుకల పార్కు
- ఆకర్షణీయంగా చిలకలగెడ్డ అటవీశాఖ పార్కు



మర్దగుడ సమీపంలోని అటవీ ప్రాంతంలో సీతాకోకచిలుక ప్రాజెక్టు ఏర్పాటు ప్రదేశమిదే



చిలకలగెడ్డ వద్ద అటవీశాఖ అభివృద్ధి చేస్తున్న పార్కు



సీతాకోకచిలుక ప్రాజెక్టు ప్రాంతానికి మట్టిరోడ్డు

అనంతగిరి: మండలంలో అటవీ పర్యాటకం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. పెరుగుతున్న పర్యాటకుల సంఖ్యకు అనుగుణంగా వారికి సౌకర్యవంతంగా ఉండేలా అటవీశాఖ చర్యలు ప్రారంభించింది. చిలకలగెడ్డ పార్కు, గోస్తనీ నదిపై జిప్‌లైన్, సీతాకోక చిలుకల పార్కు కొద్ది నెలల్లో అందుబాటులోకి రానున్నాయి.

రూ.5.5కోట్లతో..
మండల కేంద్రం అనంతగిరికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మర్దగుడ చాపరాయికి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో సీతాకోక చిలుకల పార్కు పనులు ప్రారంభమయ్యాయి. సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంలో ఈ ప్రాజెక్టును అటవీశాఖ సంకల్పించింది. ఇందుకుగాను సుమారు రూ..5.5కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే రూ.10 లక్షల వ్యయంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు పూర్తయ్యాయి. మెయిన్‌రోడ్డు నుంచి సుమారు కిలోమీటరు మేర మట్టిరోడ్డును నిర్మించారు. రాక్‌ఫిల్ డ్యామ్‌ను ఏర్పాటుచేశారు. ప్రకృతికి నష్టం జరగకుండా చెట్లపై హట్స్ ఏర్పాటుచేయనున్నారు. వీటితోపాటు సీతాకోక చిలుకల పార్కు, ఔషధమొక్కల వనం, వాచ్ టవర్ ఏర్పాటుకు ప్రణాళికపరంగా చర్యలు చేపట్టామని అటవీశాఖ తెలిపింది.

చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ వద్ద..
మన్యానికి ముఖద్వారం కావడంతో చెక్‌పోస్ట్ ఆనుకుని అటవీశాఖ పార్కు అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. పర్యాటకులు సౌకర్యార్థం రచ్చబండలు, పాత్‌వే, నర్సరీ, కాఫీ హౌస్, స్నాక్స్ అందుబాటులో ఉండేలా అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సమీపంలోని కొండపైకి ట్రెక్కింగ్‌కు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తోంది.

చివరిదశకు జిప్‌లైన్ పనులు
గోస్తనీ నదిపై సాహస ప్రయాణానికి కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్నాయి. బొర్రాగుహలను ఆనుకుని పర్యాటకశాఖ ఆధ్వర్యంలో గోస్తనీ నదిపై సుమారు రూ.35 లక్షలతో చేపట్టిన జిప్‌లైన్ పనులు దాదాపుగా చివరిదశకు చేరుకున్నాయి. ప్రకృతి అందాల మధ్య విహరిస్తూ కొత్త అనుభూతి పొందేలా ఏర్పాటుచేస్తున్న ఈ ప్రాజెక్టు పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి రానుంది.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులు చేపట్టాం. సీతాకోక చిలుకల ప్రాజెక్టు ఏర్పాటు వల్ల అటవీప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మరోపక్క పర్యాటకుల కొత్త అనుభూతినిస్తుంది. గ్రావిటీ ద్వారా తాగునీటి పథకం ఏర్పాటుకు టెండర్లు పిలిచాం. పనులు ప్రారంభం కావాల్సి ఉంది.
– దుర్గాప్రసాద్, అటవీశాఖ రేంజర్, అనంతగిరి

పార్టీ కార్యక్రమాలపై చర్చ

వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిలను వేర్వేరుగా గురువారం అమరావతిలో ఆ పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు కలిశారు. జిల్లాలో చేపట్టిన పార్టీ కార్యక్రమాలు, పార్టీ పటిష్టతకు భవిష్యత్తులో చేపట్టేబోయే కార్యక్రమాలను వారి దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఎమ్మెల్యే తెలిపారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, సచివాలయాల మండల కన్వీనర్ బండి సుధాకర్ పాల్గొన్నారు.



వైవీ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నర్సింగరావు

ఘనంగా వినాయక నిమజ్జనాలు

సాక్షి,పాడేరు: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో జిల్లాలో పలుచోట్ల గణపతి విగ్రహాల నిమజ్జనాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాడేరులోని గుడివాడవీధిలోని కొలువుదీరిన గణనాథుని విగ్రహాన్ని నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. సుమారు 23కిలోల లడ్డూను గుడివాడకు చెందిన బాకూరు మహేష్ రూ.18వేలకు, సినిమాహాల్ సెంటర్‌లో 15 కిలోల గణపతి లడ్డూను దామోదుల జగన్ రూ.4,500కు వేలంలో పొందారు. గణపతి విగ్రహాల ఊరేగింపు సందర్భంగా థింసా నృత్యాలతో సందడి చేశారు. హుకుంపేట గెడ్డలో నిమజ్జనం చేశారు.



పాడేరు గుడివాడవీధిలో గణపతి విగ్రహం, భారీ లడ్డూ ఊరేగింపు

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకటరమణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో న్యాయమూర్తి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాన్ని ఈవో అందజేశారు.



జస్టిస్ వెంకటరమణకు అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

ఏయూలో హాస్టల్ సముదాయం ప్రారంభం

- ఎకో ఫ్రెండ్లీ వాహనాన్ని ఏయూకు అందించిన ఐతం
- పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

ఎంపీవీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాడు–నేడు పనుల్లో భాగంగా ఆధునీకరించిన శ్రీకృష్ణ దేవరాయ వసతి గృహం (ఎస్‌కేడీ హాస్టల్)ను వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. నాడు– నేడు పనుల్లో భాగంగా ఈ హాస్టల్‌లో 240 గదులను ఆధునీకరించినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. మంచినీటి సౌకర్యం, విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలను ఆధునికంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమం అనంతరం సుబ్బారెడ్డి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఐతం) విద్యార్థులు రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ వాహనాన్ని ప్రారంభించారు. ఐతం విద్యార్థులు రూపొందించిన ఈ ఇంధన రహిత వాహనాన్ని ఆ కళాశాల యాజమాన్యం ఏయూకు అందజేసింది. వివిధ అవసరాల నిమిత్తం వర్సిటీని సందర్శించే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం దీన్ని ఉపయోగించనున్నారు. పర్యావరణ హితమైన ఇలాంటి వాహనాలను మరిన్ని అందుబాటులోకి తేవాలని వైవీ సుబ్బారెడ్డి సూచించారు.



ఆధునీకరించిన హాస్టల్ సముదాయాన్ని ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి తదితరులు

నేడు డుంబ్రిగుడలో జగనన్నకు చెబుదాం

- పాడేరులో నేటి ఐటీడీఏ స్పందన రద్దు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: డుంబ్రిగుడ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. డుంబ్రిగుడ మండలంలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు అందజేయాలన్నా రు. అలాగే జిల్లాలోని అన్ని శాఖల అధికారులు హాజరై జగనన్నకు చెబుదాం కార్యక్రమ అనంతరం సంబంధిత సిబ్బందితో సమావేశాలు నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

పాడేరులో స్పందన రద్దు
డుంబ్రిగుడలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం కారణంగా పాడేరు ఐటీడీఏలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి శుక్రవారం పాడేరు ఐటీడీఏకు రావొద్దని సూచించారు.

జూలో 2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 12 ఏళ్లలోపు వయసు గల పిల్లలకు జూలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, బర్డ్‌వాక్, ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు, ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 94411 30894ను సంప్రదించవచ్చు.

ఈఎన్‌సీలో విజన్ 2047 సెమినార్

సింథియా: తూర్పు నావికాదళం(ఈఎన్‌సీ) ఆధ్వర్యంలో మారిటైమ్ వార్‌ఫేర్ సెంటర్ వద్ద ఇండియన్ నేవీ విజన్–2047 అనే అంశంపై గురువారం సెమినార్ ప్రారంభమైంది. ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఈ సెమినార్‌ను ప్రారంభించారు. విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు, దౌత్యవేత్తలు, శాస్త్రవేత్తలు, విశ్రాంత నేవీ అధికారులు పాల్గొని.. పలు అంశాలపై చర్చించారు. 2047 ఆగస్టు 16 తెరిచే టైమ్ క్యాప్సూల్స్ ప్రొసీడింగ్ పత్రాలను అధికారులకు అందజేశారు.

3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సుజాత



సాక్షి,పాడేరు: సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు వచ్చేనెల 3వ తేదీన పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నామని ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ (జీఎంఆర్) పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత తెలిపారు. పాడేరు కళాశాలకు సంభందించి డిప్లమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్ 60, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 60, మెకానికల్ ఇంజనీరింగ్ 60 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. వీటిని స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తామన్నారు. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. పాలిసెట్ రాయకపోయినా ఫర్వాలేదన్నారు. ఒకవేళ పాలిసెట్ రాసి ర్యాంకు రాకపోయినా స్పాట్ అడ్మిషన్లలో అవకాశం కల్పిస్తామని ఆమె పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువపత్రాలతో వచ్చేనెల 3వ తేదీన హాజరుకావాలని ఆమె కోరారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన అభ్యర్థులు రూ.4,700 ఫీజును అదే రోజు చెల్లించి తరగతుల్లో చేరవచ్చని ఆమె పేర్కొన్నారు.పూర్తి వివరాలు పాలిటెక్నిక్ కళాశాల నోటీసుబోర్డులో పొందుపరిచామని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ



పాడేరులో మిలార్–ఉన్–నబీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సాక్షి,పాడేరు: మహ్మద్ ప్రవక్త (రసూలల్లా సల్లాల్లాహీ అలైహి వసల్లం) జన్మదినమైన మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాడేరులో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, మౌల్వీలు మాట్లాడుతూ మానవాళికి మహ్మద్ ప్రవక్త జీవితం మార్గదర్శనీయమన్నారు. ప్రవక్త సూచించిన విధంగా శాంతి, ప్రేమ, దయ, సోదర భావాలతో అందరూ కలిసి జీవించాలన్నారు. మిలాద్–ఉన్–నబీ ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం వివిధ మసీదు కమిటీల ఆధ్వర్యంలో ఫాతెహా నిర్వహించారు. ప్రసాద వితరణ జరిగింది.

సింహగిరిపై ముగిసిన పవిత్రోత్సవాలు

సింహాచలం : సింహగిరిపై గడిచిన ఐదు రోజులుగా జరిగిన పవిత్రోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిసాయి. ముగింపుని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం ఏకాంత స్నపనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. గంగధార జలాలు, పంచామృతాభిషేకాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. వేదపారాయణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



అప్పన్న ఉత్సవమూర్తులు, చక్రపెరుమాళ్లు



క్లుప్తంగా

నేడు కేంద్ర మంత్రి దర్శన జర్దోష్ రాక

యలమంచిలి: కేంద్ర రైల్వే, టెక్స్‌టైల్స్ శాఖ సహాయ మంత్రి దర్శన విక్రమ్ జర్దోష్ శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఆమె విశాఖపట్నం నుంచి అచ్యుతాపురం సెజ్‌కు చేరుకొని బ్రాండిక్స్ ఇండియా టెక్స్‌టైల్ పార్కుకు వెళతారు. మధ్యాహ్నం 2 గంటలకు యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామంలో పర్యటిస్తారు. అక్కడ ప్రసిద్ధి చెందిన లక్కబొమ్మల తయారీని పరిశీలించి, హస్తకళాకారులతో మాట్లాడతారు.

30న మినీ జాబ్ మేళా

అనకాపల్లిటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 30న వరుణ్ బజాజ్ కంపెనీ మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ విద్యార్హత ఉన్న, 18 నుంచి 25 ఏళ్ల వయసున్న యువతీ, యువకులు జాబ్‌మేళాకు అర్హులన్నారు. మర్ని వివరాలకు 81432 29228,70363 63272 నంబర్లును సంప్రదించాల్సిందిగా కోరారు.

వాలీబాల్ పోటీలు, ఎంపికల వాయిదా

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా సారథ్యంలో ఈనెల 29వ తేదీన పాడేరులోని తలారిసింగ్ క్రీడా మైదానంలో నిర్వహించాల్సిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వాలీబాల్ (అండర్-14) పోటీలు, ఎంపికలు వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి, విశాఖ, ఏఎస్ఆర్ జిల్లాల కార్యదర్శులు టి.నాగేశ్వరరావు, ఎం.వి.నాగేశ్వరరావు, పి.సూరిబాబు తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, మూడు జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు గమనించాలని వారు కోరారు.

విజయీభవ:

- ఆసియాడ్ పతకమే లక్ష్యంగా విశాఖ క్రీడాకారులు
- ఇప్పటికే టెన్నిస్‌లో సాకేత్ జోడి సెమీస్‌కు చేరిక

విశాఖ స్పోర్ట్స్: ఒలింపిక్స్‌లో పతకం సాధించడం ఒక కల. ఆసియాడ్‌లో పతకం సాధించడం ఒక లక్ష్యం. అది సాధించే అవకాశం మన విశాఖ క్రీడాకారులకు వచ్చింది. ఆసియన్ దేశాల్లో ప్రతి ఒక్క క్రీడాకారుడి లక్ష్యం నెరవేర్చుకునేందుకు ప్రస్తుతం చైనాలోని హేంగ్జౌ వేదికగా ఆసియన్ గేమ్స్ జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 24 క్రీడల్లో కాంపిటీటివ్ స్పోర్ట్స్, 18 బాల్ స్పోర్ట్స్, 9 అడ్వర్సరీ స్పోర్ట్స్, 10 వాటర్ స్పోర్ట్స్ పోటీలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 8వ తేదీతో ముగియనున్నాయి. మొత్తం 35 స్పోర్టింగ్ ఈవెంట్లలో దేశం తరఫున 653 మంది క్రీడాకారులు తరలివెళ్లగా.. వారిలో ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన 16 మందిలో విశాఖ క్రీడాకారులు నలుగురున్నారు. వారిలో ముగ్గురు వుమెన్ కాగా.. ఒకరు మెన్. వీరందరికి ఇదే తొలి ఆసియాడ్. వీరంతా విజయకేతనం ఎగురవేసి మువ్వన్నెల జాతీయ పతాకను విశ్వవిను వీధిలో రెపరెపలాడించి తిరిగి రావాలంటూ ఆకాంక్షిద్దాం.

విశాఖ నుంచి పతకం కోసం మరోసారి..



స్కేటర్ గ్రీష్మ



స్కేటర్ సాయిసంహిత

ఆసియాడ్ రోలర్ స్కేటింగ్‌లో విశాఖ మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమైంది. విశాఖ చిన్నారులు సాయిసంహిత, గ్రీష్మ భారత్ తరఫున మహిళల ఆర్టిస్టిక్ విభాగం వ్యక్తిగత పోటీల్లో తలపడనున్నారు. వీరిద్దరూ నాలుగేళ్ల ప్రాయంలోనే కాళ్లకు చక్రాలు కట్టుకున్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధిస్తూ ఆసియాడ్‌కు ఎంపికై ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. విజయం సాధించి జాతీయ పతకాన్ని రెపరెపలాడిస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. 6వ తేదీన జరగనున్న మహిళల ఆర్టిస్టిక్ సింగిల్ ఫ్రీ స్కేటింగ్‌లో సాయిసంహితతో పాటు గ్రీష్మ సైతం ఈవెంట్‌లో భారత్ తరఫున పోటీ పడనున్నారు. ప్రస్తుత ఆసియాడ్‌లో పతకాలు సాధిస్తే విశాఖ నుంచి మరోసారి పతకాలు సాధించిన స్కేటర్లుగా నిలవనున్నారు. విశాఖ స్కేటర్లు అరుణ్-పాంచాల్ జోడి గతంలోనే ఆసియాడ్‌లో పతకం సాధించింది.

విశాఖలో రాకెట్ పట్టి.. ప్రొఫెషనల్‌గా అమెరికాకు..



మైనేని సాకేత్ చిన్నతనంలో రాకెట్ చేతబట్టింది విశాఖలోనే. క్రమంగా టెన్నిస్‌నే కెరీర్‌గా ఎంచుకుని మెరుగైన శిక్షణ కోసం ఢిల్లీకి మకాం మార్చాడు. జాతీయ స్థాయిలో రాణిస్తూ అక్కడి నుంచే అమెరికాకు వెళ్లి ఏటీపీ టూర్స్ డబుల్స్‌లో పాల్గొన్నాడు. ఏకంగా గత నెలలో యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో పోటీ పడ్డాడు. యూఎస్ డాలర్ల రూపంలోనే ప్రైజ్‌మనీని సొంతం చేసుకుంటూ (లక్ష డాలర్ల నగదు ప్రోత్సాహం) దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం డబుల్స్‌లో 84వ ర్యాంక్‌లో ఉన్నా.. కెరీర్ బెస్ట్‌గా 74వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

సాకేత్ సెమీస్‌కు ఇలా..

టెన్నిస్ మెన్ డబుల్స్‌లో రామనాథన్‌తో జోడి కట్టిన సాకేత్(ఇండియా-2) ఆరంభ మ్యాచ్‌లో నేపాల్ జోడిపై రెండు స్ట్రయిట్ సెట్స్‌లోనే విజయం సాధించి శుభారంభం చేసింది. రెండో రౌండ్‌లోనూ ఇండోనేషియాపైనా స్ట్రయిట్ సెట్స్‌లోనే విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఆతిథ్య చైనా(చైనా-1) జట్టుపై తొలి సెట్‌ను సునాయాసంగానే గెలిచినా రెండో సెట్‌లో చెమటోడ్చి 7-6(8)తో మ్యాచ్ డిసైడ్ చేసేసి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. సెమీస్‌లో కొరియా-1 జట్టుతో గురువారం రాత్రి తలపడనుంది.

హర్డిల్స్‌లో వెలిగిన 'జ్యోతి'

హర్డిల్స్‌లో తన జాతీయ రికార్డునే తిరగరాసిన జ్యోతి.. ఈసారి ఆసియన్ బెస్ట్‌గా నిలిచేందుకు సిద్ధమైంది. ఆసియన్ చాంపియన్‌షిప్‌కు భిన్నంగా ఆసియాలోని ప్రతీ దేశం పోటీపడే ఆసియన్ గేమ్స్‌లో పతకం సాధించి ఫాస్టెస్ట్ హర్డిలర్ రికార్డును సొంతం చేసుకోవడమే లక్ష్యమంటుంది విశాఖ అథ్లెట్ జ్యోతి. జాతీయ స్థాయిలో పాల్గొన్న మీట్స్‌లో రికార్డులు నెలకొల్పిన ఈమె ఆసియన్ చాంపియన్‌షిప్‌లోనూ అర్ధ శతాబ్దపు భారత్ వ్యక్తిగత స్వర్ణ పతక ఆశను నెరవేర్చి, ఫాస్టెస్ట్ రికార్డు సొంతం చేసుకుంది. ఇటీవల ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పాల్గొని కాస్త తడబడినా.. అథ్లెట్ల సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన జ్యోతి అదే అనుభవంతో ఈసారి ఆసియాడ్‌లో పతకం కంటే 13 సెకన్లపైనే దృష్టి పెట్టి విజేతగా నిలవాలనే ఆకాంక్ష వ్యక్తం చేస్తోంది. 30వ తేదీ శనివారం ఉదయం సెషన్‌లో ఆమె ట్రాక్‌లోకి దిగనుంది.



హర్డిలర్ జ్యోతి

హృదయం.. పదిలమేనా?

- ఆందోళన కలిగిస్తున్న గుండెపోటు మరణాలు
- యుక్త వయసులోనే తనువు చాలిస్తున్న పలువురు
- జీవనశైలి, ఆహారంలో మార్పులే కారణమంటున్న వైద్యులు

మహారాణిపేట (విశాఖ): జీవన శైలిలో మార్పులు, అధిక బరువు, రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలతో గుండె లయ తప్పుతోంది. నిమిషానికి 72 సార్లు కొట్టుకోవాల్సిన హృదయం కొన్ని సార్లు మొరాయిస్తోంది.. మరికొన్ని సార్లు అతివేగంగా కొట్టుకుంటోంది. గతంలో 45 ఏళ్లు దాటాక గుండె పోటు వచ్చేది. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా వచ్చే వ్యాధుల్లో ఎక్కువగా గుండె పోటు పేరే వినిపిస్తోంది. ఈ రోజు హార్ట్ డే. గుండెను ఎంత ప్రమాదంలోకి నెడుతున్నామో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

కేజీహెచ్‌లో 24×7 సేవలు

కేజీహెచ్‌లో రెండు కార్డియాలజీ యూనిట్లు ఉన్నాయి. మొదటి యూనిట్ విభాగాధిపతిగా డాక్టర్ బి.ఆదిలక్ష్మి, రెండో యూనిట్ విభాగాధిపతిగా డాక్టర్ మల్లాది శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. వీరికి అసోసియేట్ ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహాయంగా ఉంటున్నారు. ఐసీయూలో 13 పడకలు ఏర్పాటు చేశారు. కార్డియాలజీ ఓపీకి ప్రతి రోజూ 200 నుంచి 300 మంది రోగులు వస్తుంటారు. ఇక్కడ నెలకు 100 ఎంజియోగ్రామ్, 40 స్టంట్‌లు, 30 తాత్కాలిక పేస్‌మేకర్లు, 15 శాశ్వత పేస్‌మేకర్లు ఉచితంగా అమర్చుతున్నారు. వేల రూపాయల్లో ఉండే మందులు, ఇంజక్షన్లను రోగులకు ఉచితంగా ఇస్తున్నారు. గుండెకు నీరు చేరడం, గుండెకు కన్నం పడడం తదితర సమస్యలకు కూడా ఇక్కడ వైద్య సేవలందిస్తున్నారు.



కేజీహెచ్‌లో కార్డియాలజీ విభాగం

ఒత్తిడికి గురికావద్దు



ప్రతీ మనిషి జీవితంలో ఒత్తిడి సహజం. ఒత్తిడిని నియంత్రించడం ద్వారా గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చు. ఇందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధ్యానం, యోగా వంటివి ఉపయుక్తంగా నిలుస్తాయి. గతంలో పోలిస్తే యువకుల్లో గుండె పోట్లు పెరుగుతున్నాయి. కరోనా తర్వాత అవి మరింత ఎక్కువయ్యాయి. రాత్రి నిద్ర తక్కువ పోవడం వల్ల పగలు ఒత్తిడి పెరుగుతుంది. కనీసం రోజుకు 6-7 గంటలు నిద్రపోవాలి. 45 నిమిషాలు నడవాలి. గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి.

– ప్రొఫెసర్ ఆదిలక్ష్మి, కార్డియాలజీ విభాగం, కేజీహెచ్

ఆహార నియమాలతో వ్యాధులు దూరం



గుండెపోటుకు ఎంత త్వరగా చికిత్స ఆరంభిస్తే అంత మంచిది. గుండె పోటుతో రక్తం సరఫరా నిలిచిపోయినప్పుడు ఈ భాగంలోని కండరం దెబ్బతిని చివరికి చచ్చుబడుతుంది. ఈ లోపు చికిత్స మొదలు పెడితే సమస్య తీవ్రం కాకుండా ఉంటుంది. గుండె, రక్తనాళాల సంబంధిత వ్యాధులను 80 శాతం వరకు నివారించవచ్చు. ఏదైనా అతిగా చేయడం వల్ల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. మద్యంగానీ, ఆహారం గానీ అతిగా తీసుకోవడం వల్ల ఆ ప్రభావం గుండె మీద పడుతుంది.

– డాక్టర్ ఎస్.సి.సిన్హా, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, స్టార్ పినాకిల్ హార్ట్ సెంటర్

చోడవరంలో మహిళా మార్ట్

- అతివలు ఆర్థికంగా ఎదిగితేనే పురోభివృద్ధి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబానికి ఆసరాగా నిలవాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేయూత పథకాన్ని అందిస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పట్టణంలో డ్వాక్రా మహిళల మండల సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఈ మార్ట్‌ను డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రతీ మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందన్నారు. డ్వాక్రా మహిళలంతా కలిసి ఒక మార్ట్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి కల్పించుకోవడం అభినందనీయమన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఉమాపతి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో డ్వాక్రా సంఘాల ద్వారా అత్యధికంగా మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఏరియా కో ఆర్డినేటర్ రత్నప్రభ, ఏపీఎం కనకరాజు, మహిళా మార్ట్ చీఫ్ ప్రమోటర్ ఓబుబోయిన వరలక్ష్మి, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు కామలక్ష్మి, సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌లో సరకులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

స్నేహితుడిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

సీతమ్మధార: స్నేహితుడిని హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు శివకుమార్(అలియాస్ శివారెడ్డి)ని ద్వారకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. సీతంపేటకు చెందిన కిశోర్‌కుమార్(26) నగరంలోని ఒక ప్రైవేట్ సంస్థలో సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శంకరమఠం రోడ్డులో స్నేహితుడు ఆదివారం నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న కిశోర్ అదే ప్రాంతంలో ఉంటున్న దయ, కిరణ్, శివారెడ్డితో కలిసి మద్యం సేవించారు. రాత్రి 8 గంటల సమయంలో కిశోర్ తన ఇంటికి వెళ్లిపోయాడు. మళ్లీ ఫోన్ రావడంతో శ్రీనగర్‌లో ఉన్న శివారెడ్డి ఇంటికి వెళ్లాడు. మూడో అంతస్తులో నలుగురూ మరోసారి మద్యం సేవించారు. తన భార్య వేరే వ్యక్తితో మాట్లాడానికి ప్రోత్సహిస్తున్నాడన్న అనుమానంతో కిశోర్‌ని మాట్లాడాలని పక్కకు పిలిచిన శివారెడ్డి మేడపై నుంచి తోసేసి పరారయ్యాడు. తోటి స్నేహితులు కిశోర్‌ని కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శివారెడ్డి తునిలో దాబాలో పని చేస్తున్నాడు. ఏసీపీ వివేకానంద ఆధ్వర్యంలో సీఐ సీహెచ్.సింహాద్రినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖ రైల్వేస్టేషన్ రోడ్డులో శివారెడ్డి ఉన్నట్లు గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు.

ఘనంగా సహస్ర తులసి పూజ

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న యువకుడ్ని టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన జగదీష్ యాదవ్(45) (పాన్‌మసాల వ్యాపారి), మరో వ్యక్తి ఆనంద్ కలిసి భువనేశ్వర్ వెళ్లి 7.5 కిలోల గంజాయి తీసుకువచ్చారు. రామాటాకీస్ దగ్గర బస్సు ఎక్కేందుకు నిరీక్షిస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. అటువైపుగా వెళ్తున్న టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథ్ తన సిబ్బందితో తనిఖీలు చేయడంతో బ్యాగులో 7.5 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. జగదీష్‌ను అదుపులోకి తీసుకుని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఆనంద్ పరారయ్యాడు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ రమేష్ కుమార్ సుమన్

అనకాపల్లి రూరల్: జీవ వైవిధ్య పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ రమేష్ కుమార్ సుమన్ అభిప్రాయపడ్డారు. మండలంలోని తుమ్మపాల శారదావేలీ అభివృద్ధి సమితి ట్రైనింగ్ హాలులో గురువారం జరిగిన ఇంటెన్సివ్ కోర్ కార్యకలాపాల కార్యాచరణ ప్రణాళిక అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవ వైవిధ్య సంరక్షణకు కృషి చేస్తున్న వివిధ ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులతో సమీక్షించారు. జీవ వైవిధ్య సంరక్షణ మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యమన్నారు. వన్యప్రాణులు, వివిధ రకాల ఔషధ మొక్కలను కాపాడుకోవాలన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యకలాపాల విజయవంతానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా నీటి వనరుల సంరక్షణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన చేపట్టాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలను భాగస్వామ్యం చేసుకుని విద్యార్థుల్లో చైతన్యం తేవడానికి కృషి చేస్తే కార్యక్రమాలు మరింత విజయవంతమవుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌బీబీ ప్రాంతీయ సమన్వయకర్తలు, వివిధ ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాముకాటుతో పాడిరైతు మృతి

అనకాపల్లి టౌన్: మండలంలో మారేడుపూడి పంచాయతీ గున్నవానిపాలెం గ్రామానికి చెందిన వాకాడ రమణ(44) పాము కాటుతో మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు గురువారం చెప్పారు. బుధవారం రాత్రి తన పశువులకు మేత వేసేందుకు వెళ్తుండగా పాము కాటు వేసిందన్నారు. హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

రావికమతం: మండలంలోని కొంట్నాబిల్లి కొండపై సారా తయారీకి నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం పులుపుతోపాటు సామగ్రిని ధ్వంసం చేసినట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామ సమీపంలోని కొండపై పెద్ద ఎత్తున సారా తయారీ చేస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. అక్కడ పెద్ద ఎత్తున డ్రమ్ములతో పులుపు లభ్యమవ్వగా ధ్వంసం చేసి పాత్రలను దహనం చేశామన్నారు.



పులుపు ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

సాగర్‌నగర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి



ఆనందరావు మృతదేహం

కొమ్మాది: సాగర్‌నగర్‌లో ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ మాంసం దుకాణాల సముదాయం వద్ద రోడ్డుపై గురువారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం ఉంది. స్థానికులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ అప్పారావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న కీప్యాడ్ ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించారు. మృతుడు అరకు, బొర్రాకు మధ్య ఉన్న జయంతివలస గ్రామానికి చెందిన సిరిగపు ఆనందరావు(35)గా గుర్తించారు. భార్య పద్మతో కలసి కంచరపాలెంలో నివాసం ఉంటూ రైల్వే న్యూకాలనీ సమీపంలో ఫ్లవర్ డెకరేషన్‌లో పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇదిలా ఉండగా ఆనందరావు ప్రమాదవశాత్తు చనిపోయాడా? లేక ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంచరపాలెంలోనో, రైల్వే న్యూకాలనీలో ఉండాల్సిన వ్యక్తి రాత్రి సమయంలో సాగర్‌నగర్‌కు ఎందుకు వచ్చాడన్న కారణం ఎవరికి తెలియలేదు. మృతుడి తలపై బలమైన గాయాలు, రక్తస్రావం అయిన జాడలు ఉన్నాయి. తల వెనక భాగంలో గాయాలు ఉన్నాయి. హత్యా? లేక ఆత్మహత్యా? అనే కోణంలో ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

వాహన మిత్రలో విశాఖదే పైచేయి

- నాలుగు విడతల్లో రూ.125.54 కోట్ల అందజేత
- నేడు ఐదో విడత నిధుల జమ

గోపాలపట్నం: వైఎస్సార్ వాహనమిత్ర పథకంలో భాగంగా ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేల ప్రభుత్వ సాయం అందివ్వడంలో విశాఖ ఆర్టీఏ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. 2019-20లో 32,778 మంది లబ్ధిదారులకు రూ.32.77 కోట్లు, 2020-21లో 38,001 మందికి రూ.38.01 కోట్లు, 2021-22లో 34,059 మందికి రూ.34.05 కోట్లు అందజేసినట్లు చెప్పారు. జిల్లాల విభజన తర్వాత 2022-23లో 20,711 మంది లబ్ధిదారులకు రూ.20.71 కోట్లు అందించామన్నారు. 2023-24 ఏడాదిలో 21,134 మందికి రూ.21.13 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో రూ.125.54 కోట్లు అందజేసినట్లు వెల్లడించారు. కాగా.. వాహనమిత్ర ఐదో విడత నిధులను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయనున్నారు.

పరిమళించిన మానవత్వం

ప్రమాద బాధితుడికి దాతల ఆర్థిక సాయం

రావికమతం: వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన కొత్తకోటకు చెందిన పడమటి శ్రీనివాసరావుకు పలువురు దాతలు అండగా నిలుస్తూ తమ ఉదారత చాటుకుంటున్నారు. శ్రీనివాసరావు తల్లి కూడా హృద్రోగ సంబంధిత సమస్యతో మంచం పట్టడం, వృద్ధ తండ్రి దిక్కుతోచని స్థితిలో ఉండటంపై 'అనుకోని ప్రమాదం అంతులేని ఆవేదన' శీర్షికన సాక్షిలో ఈ నెల 25న ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు మానవత్వంతో స్పందిస్తున్నారు. గురువారం కొత్తకోట గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ యూత్ సభ్యులు రూ.15 వేలు, చికెన్ వ్యాపారి ఆర్.వి.రెడ్డి రూ.5 వేలు, గ్రామ సర్పంచ్ లోవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకర్రావు, దొర, పాండు రూ.5 వేలు, కొత్తకోట హైస్కూల్ ఆఫీసు సబార్డినేట్ పి.సూర్యమణి నిత్యావసర సరకులతో పాటు రూ.వెయ్యి సాయాన్ని అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



రూ.15 వేల సాయం అందిస్తున్న ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ యూత్ సభ్యులు